క్లుప్తంగా

గణపతి ఆలయంలో భక్తుల సందడి



విశేషాలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారుజామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,64,289లు ఆదాయం లభించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

కృష్ణ భగవానుడే ఆదిదేవుడు

అయినవిల్లి: శ్రీకృష్ణుడు ఆది దేవుడని, ఆయన్ను చేరుకోవడం కోసమే మనం నిత్యం శ్రీకృష్ణ నామం స్మరించాలని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో కృష్ణుడికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. శ్రీకృష్ణుడి తత్వం ఎవ్వరికీ బోధపడదన్నారు. అలా బోధపడిన వ్యక్తి నేరుగా శ్రీకృష్ణ భగవానుడిలో ఐక్యం అవుతారన్నారు.

ఉపాధ్యాయుడు ఆలేటికి సన్మానం



కొత్తపేటలో దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కొత్తపేట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆలేటి దుర్గాప్రసాద్‌ను స్థానిక సంతోష్ నగర్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మండలంలోని అవిడి ఎంపీపీ మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయనకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు రావడం కొత్తపేటకు గర్వకారణమని భావిస్తూ స్థానికులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ విళ్ల మారుతీ ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

మామిడికుదురు: గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి పని చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. ఎండీఆర్ నిధులు రూ.60 లక్షలతో చేపట్టనున్న మగటపల్లి- మోరిపాలెం బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు బొలిశెట్టి జగదీష్ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు భూమి పూజ



శంకరగుప్తంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

సాక్షి ఇంపాక్ట్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో నాలుగు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భూమి పూజ నిర్వహించారు. ఈ నెల 17న సాక్షిలో ఇలా వదిలేస్తే.. వేళ్లేదెలా అనే శీర్షికతో ప్రచురణమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. అదే రోజు మండల సమావేశంలో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించిన అనంతరం అమరావతి వెళ్లి ఉన్నతాధికారులతో రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. మొత్తం నాలుగు ప్రధాన రోడ్లకు రూ.3.10 కోట్లతో పనులు ప్రారంభించారు. శంకరగుప్తం- బట్టేలంక రోడ్డుకు రూ.42 లక్షలు, మట్టపర్రు రోడ్డు పునర్నిర్మాణానికి రూ.94 లక్షలతో భూమి పూజ చేశారు. మగటపల్లి- అంబేడ్కర్ సెంటర్ నుంచి మోరిపాలెం వరకూ రోడ్డు పనులకు రూ.60 లక్షలతో శంకుస్థాపన చేశారు. దిండి వై.జంక్షన్ నుంచి- రామరాజులంక వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.1.14 కోట్లతో పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాజోలు డీసీ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, సర్పంచ్ ఆనంద్‌కుమార్, గుబ్బల ఫణి కుమార్, ఎంపీటీసీలు మానుకొండ ప్రమీళ, ఆచంట మాణిక్యం, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, రావూరి నాగు, కొమరగిరి శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ డీఈ రవి, ఏఈ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

దసరా శోభ.. ఉత్సవ ప్రభ

- నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం
- రోజుకో అలంకరణతో అమ్మవారి దర్శనం
- ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు ముస్తాబవుతున్న కొత్తపేట బి.సావరంలోని దుర్గాదేవి ఆలయం



విజయ కనకదుర్గాదేవి

కొత్తపేట: దసరా ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. గ్రామాల్లో జగజ్జనని దుర్గాదేవి దేవీనామ స్మరణలు మారుమోగనున్నాయి. ఆశ్వ యుజ శుద్ధ పాడ్యమి (సోమవారం) మొదలు దశమి (విజయదశమి) అక్టోబర్ 2 వరకూ ఈ ఉత్సవాలకు ఊరూవాడా సిద్ధమయ్యాయి. గ్రామగ్రామాన ఉన్న కనకదుర్గాదేవి ఆలయాలతో పాటు, వివిధ గ్రామాల్లోని పలు సెంటర్లలో శరన్నవరాత్ర ఉత్సవ పందిళ్లు నెలకొల్పారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు 490 కనకదుర్గాదేవి ఆలయాలున్నాయి. ఆయా ఆలయాలతో పాటు గ్రామ కూడళ్లు, పలు వాడల్లో శరన్నవరాత్రులు పురస్కరించుకొని ప్రత్యేకంగా దుర్గాదేవిని ప్రతిష్ఠించి 10 రోజులపాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అమ్మవార్లకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు, హోమాలు, శ్రీచక్ర అర్చనలు, కుంకుమార్చనలు, శ్రీలలితా సహస్ర పారాయణాలు నిర్వహిస్తారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవార్లకు రోజుకో అలంకరణ చేయనున్నారు.

కొత్తపేట బి.సావరం వద్ద స్వయంభూ దుర్గాదేవి

ప్రధానంగా కొత్తపేట శివారు బొరుసువారి సావరం వద్ద కాలువ గట్టుపై ఒక పెద్ద చెట్టు వద్ద పూర్వకాలం నుంచి దుర్గాదేవి ఆలయం ఉంది. కొత్తపేట పరిసర ప్రాంతాలకు ఏకైక దుర్గాదేవి ఆలయంగా విరాజిల్లింది. ఆ ప్రాంతంలో గజ్జెల శబ్దంతో అమ్మవారు తిరిగేవారని పూర్వీకులు చెబుతున్నారు. ఆ అమ్మవారే తమకు రక్షణగా ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఒకరోజు సిమ్మెంటు బస్తాలు రవాణా చేస్తుండగా వాటిలోని ఒక బస్తాలో సిమ్మెంటు అమ్మవారి రూపంలో విగ్రహంగా గడ్డకట్టిందని, నిత్యం తమను వెన్నంటి ఉన్న అమ్మవారే స్వయంభుగా వెలిసిందని భావించి బొరుసు అయ్యన్న అనే పడవ కార్మికుడు, యజమాని ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారుగా ప్రసిద్ధి చెందింది.

ఆలయం పునర్నిర్మాణం

ఆ ఆలయాన్ని కొన్నేళ్ల క్రితం ఆ గ్రామానికి చెందిన పోస్టల్ ఉద్యోగి బొరుసు చంద్రరావు- పూర్ణచంద్రావతి దంపతుల కోరిక మేరకు వారి కుమారుడు వెంకట ఉదయభాస్కర్ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయంగా పునర్నిర్మించారు. ఏటా శరన్నవరాత్రులు, ఆలయ వార్షికోత్సవం, ప్రతి నెలా పౌర్ణమి, వివిధ పర్వదినాల్లో వివిధ కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

శరన్నవరాత్రులు 11 రోజులు భాస్కర్- వసుధ దంపతుల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు బిక్కవోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితుడు బ్రహ్మశ్రీ అనంత లక్ష్మణకుమారాచార్యులు తదితర అర్చక, వేదపండితుల బృందంతో తొలిరోజు అమ్మవారిని రజత కవచాలంకృత దుర్గాదేవిగా అలంకరణతో 10 రోజుల అవతారాల దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు, వివిధ హోమాలు, కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు

స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతను నిజరూప దర్శనం నుంచి రాజరాజేశ్వరీ దేవిగా 10 అవతారాల్లో అమ్మవారి అలంకరణలు, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వాడపాలెం జ్ఞానసరస్వతీ, అయ్యప్పస్వామి ఆలయంలో పది రోజులు పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఏనుగులమహల్‌లో ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆలయ ట్రస్టీ భక్తుల పర్యవేక్షణలో 10 రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలు, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో గ్రామగ్రామాన శరన్నవరాత్ర మహోత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు



పెదపట్నంలంకలో కొలువు తీరిన కనకదుర్గమ్మ

అంబాజీపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను సిద్ధం చేశారు. సోమవారం నుంచి అక్టోబర్ 2 వరకూ దేవి శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. కనకదుర్గ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అంబాజీపేట, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, వ్యాఘేశ్వరం, ఇరుసుమండ, ముక్కామల, పసుపల్లి, వక్కలంక, కమ్మజువారిలంక, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మాచవరం, ఇసుకపూడి, చిరతపూడి, నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాల్లో ఆలయాల వద్ద సందడి నెలకొంది.

నేటి నుంచి కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు

అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకూ నిర్వహించనున్నట్లు శ్రీవాసవీ వైశ్య సంఘ సభ్యులు తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవ శుభపత్రికలను ఆదివారం విడుదల చేశారు. 22న కన్యకాపరమేశ్వరిదేవి , 23న గాయత్రిదేవి, 24న అన్నపూర్ణదేవి, 25న కాత్యాయినిదేవి, 26న లలితాదేవి, 27న బాలాత్రిపుర సుందరీదేవి, 28న సరస్వతి దేవి, 29న మహాలక్ష్మి దేవి, 30న రాజరాజేశ్వరిదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దని, 2న విజయదుర్గాదేవి అలంకారాలు అమ్మవారికి చేయనున్నట్లు పేర్కొన్నారు.

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువు తీరిన కనకదుర్గ ఆలయంలో సోమవారం నుంచి అక్టోబరు 2 వరకు శత చండీయాగ సహిత శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 7.48 గంటలకు ఉత్సవాల నిర్వహణకు కలశస్థాపన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారి విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు శ్రీచక్ర అర్చన, పంచామృతాభిషేకం, శ్రీమహాలక్ష్మి యాగం, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్ర నామ పారాయణం, అమ్మవారికి విశేష అలంకరణ జరుగుతుందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు. పాశర్లపూడిబాడవ, మగటపల్లి శ్రీగాయత్రి త్రిశక్తి పీఠం, మామిడికుదురు విజయదుర్గమ్మ ఆలయాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో దేవీ నవరాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆలయాల ఎదుట చలువ పందిళ్లు వేసి, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఉదయం కలశస్థాపనతో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, వివిధ అవతారాల్లో ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తారన్నారు. 29న సరస్వతీ పూజ, వచ్చే నెల 2న విజయదశమి సందర్భంగా హంస వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ప్రారంభమయ్యే దేవి నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆయా దుర్గాదేవి ఆలయాలతో పాటు మండపాల్లో ఏర్పాటు చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాలకు చేపట్టిన విద్యుత్‌లంకరణ విశేషంగా ఆకట్టుకుంది. దీంతో నవరాత్ర తొమ్మిది రోజులు అంతటా ఆధ్యాత్మికత నెలకొననుంది.

కూటమి కుట్రలను అడ్డుకుందాం

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- జెండా ఆవిష్కరణకు స్థల పరిశీలన



అంతర్వేదిలో పార్టీ జెండా స్తూపాన్ని పరిశీలిస్తున్న గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీని అణచి వేసే కూటమి కుట్రలను ఏమాత్రం సాగనివ్వమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం ఆయన అంతర్వేదిలో ఈనెల 27న నియోజకవర్గ పరిశీలకులుగా నియమించబడిన కర్రి పాపారాయుడు మొదటిసారి నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణకు స్తూపాన్ని, స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో అన్ని వర్గాలు, అనుబంధ సంఘాలతో పార్టీ బలీయంగా మారిందన్నారు. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి పక్షాన పోరాడేందుకు పార్టీ నేతలు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, నాయకులు ఈద రవిరెడ్డి, కటకంశెట్టి ఆదిత్య, గుబ్బల మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు గునిశెట్టి వాసు, సర్పంచ్‌లు కొండా జాన్ బాబు, నక్కా రామారావు, నల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు అడ్డుగా కంచె



సీసీరోడ్డుకు అడ్డంగా కంచె కడుతున్న రామరాజు

రాజోలు: పంచాయతీ సీసీరోడ్డుకు అడ్డంగా చింతలపల్లి పిప్పళ్ల వారి గ్రామంలో ఎవరూ రోడ్డుపై వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశారు. పిప్పళ్ల వారి మెరకకు చెందిన బుజ్జి ఇంటిపని నిమిత్తం ఇసుకను ట్రాక్టర్‌పై రప్పించుకున్నాడు. అయితే ఇసుక ట్రాక్టర్ సీసీరోడ్డుపై వెళ్లడంతో ట్రాక్టర్ టైర్లకు ఉన్న మట్టి రోడ్డుపై పడి రోడ్డు పాడైపోయిందని జనసేన మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు గణసాల రామరాజు, సతీష్ రోడ్డుపై ఎవరూ తిరగకుండా ఇనుప చట్రాలు, కర్రలతో కంచె ఏర్పాటు చేశారు. దీంతో పిప్పళ్ల లక్ష్మి నాగ నరసింహారావు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆ ప్రాంతానికి చేరుకొని కంచె పూర్తిగా తొలగిచకుండా బైక్స్, నడిచివెళ్లే విధంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు. రోడ్డుకు అడ్డంగా కంచె ఏర్పాటు చేయడంపై పంచాయతీలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని బుజ్జి వాపోయారు. రోడ్డుపై అడ్డంగా ఏర్పాటు చేసిన కంచెను తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కపిలేశ్వరపురం సమితి యూనిట్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట, కె.గంగవరం మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రజా పరిషత్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ జిల్లా నేతలు భాస్కర్, సతీష్ ఎన్నికలు నిర్వహించారు. కపిలేశ్వరపురం సమితి యూనిట్ అధ్యక్షుడిగా తమనంపూడి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆలమూరు మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు, కార్యదర్శిగా మండపేట మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌వివిఎంపీ గోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.సతీష్ మోహన్, జూనియర్ అసిస్టెంట్, (ఆలమూరు), సంయుక్త కార్యదర్శిగా కె.వీరేంద్రనాథ్, కోశాధికారిగా వైకే చైతన్య, (కపిలేశ్వరపురం), జిల్లా కౌన్సిలర్లుగా రాజేంద్రప్రసాద్ (కపిలేశ్వరపురం), మెహెర్ ప్రకాష్, (ఆలమూరు) ఎంపికైన వారిలో ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పి.గన్నవరం: స్థానిక అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం జరగనుంది. స్థానిక బాలాజీ థియేటర్ పక్కన బీవీఆర్ కాంప్లెక్స్‌లో కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేస్తారని వెంకటేశ్వరరావు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

అయినవిల్లి: వివేకానంద కేంద్ర, అమలాపురం కార్యస్థాన్ ఆధ్వర్యంలో నేదునూరు రావి ఫౌండేషన్ వద్ద విశ్వ భ్రాతృత్వ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం మండల స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అయినవిల్లి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వివేకానందుని షికాగో ప్రసంగం అనే అంశంపై పోటీలు జరిపారు. విజేతలకు వివేకానంద సేవా సమితి, అమలాపురం కార్యదర్శి గొవ్వాల నాగరాజు బహుమతులు అందించారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి జగ్గిరెడ్డి పరామర్శ



జొన్నాడలో మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ తాడి నాగమోహన్‌రెడ్డి (60) కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఆదివారం మృతుడి నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి నాండ్ర నాగమోహన్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్య రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

చెరువును తలపించేలా పాఠశాల ప్రాంగణం



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిల్వ ఉన్న మురుగు నీరు

అంబాజీపేట: కొద్దిపాటి వర్షానికే అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నీరు నిల్వ ఉండిపోయి చెరువును తలపిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులు మంచినీరు తాగేందుకు, సైకిల్ షెడ్డు వద్దకు వెళ్లాలన్నా ఆ మురుగు నీటిలోనే వెళ్లాల్సి వస్తుంది. నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు పెరిగిపోడమే కాకుండా దుర్వాసన వెదజల్లుతున్నా ఎస్ఎంసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాకర్స్ విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాయామం నిత్యకృత్యం కావాలి

అయినవిల్లి: వ్యాయామం చిన్ననాటి నుంచే నిత్యకృత్యం కావాలని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. ఇటీవల అమలాపురంలో జరిగిన కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన ముక్తేశ్వరం రారాజు జిమ్ అండ్ స్పోర్ట్స్ అకాడమికి చెందిన 14 మంది విద్యార్థులకు ఆయన పతకాలు అందించి సత్కరించారు. వీరిలో ఐదుగురు గోల్డ్ మెడల్, ఆరుగురు సిల్వర్, ముగ్గురు రజిత పతకాలు సాధించారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించి ఎస్సై సత్కరించారు. కార్యక్రమంలో జిమ్ అండ్ కరాటే కోచ్ రారాజు, కరాటే సీనియర్స్ మాస్టర్స్ పీవీఎస్ వర్మ, పనసరాముడు, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, జిమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు సీఐ హెచ్చరిక

అంబాజీపేట: పి.గన్నవరం సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు రాత్రి 7 తర్వాత రోడ్డుపై కనబడితే వాళ్లపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపిస్తామని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. జిల్లా నూతన ఎస్పీ రాహుల మీనా, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ ఆదేశాల మేరకు భీమరాజు అంబాజీపేట పోలీసు స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. భీమరాజు మాట్లాడుతూ, శాంతి భద్రతల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, ఒక్క అడుగు కూడా వెనక్కి వేసేది లేదని ఆయన రౌడీ షీటర్లను హెచ్చరించారు.

రోడ్డు కింద కొట్టుకుపోయిన గ్రావెల్



అప్పనపల్లిలో సీసీ రోడ్డు అడుగు భాగంలో కొట్టుకుపోయిన గ్రావెల్

మామిడికుదురు: వరదకు సీసీ రోడ్డు అడుగు భాగంలో ఉన్న గ్రావెల్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఇది ఈ నాటి సమస్య కాదు, మూడు, నాలుగేళ్ల క్రితం నుంచీ ఉంది. కానీ దీన్ని పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు అంటున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి అప్పనపల్లి మొల్లేటివారి పాలెం వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా ఇదే పరిస్థితి ఉంది. వరద ప్రవాహం తీవ్రంగా ఉన్న చోటే ఈ విధంగా ఉంది. ఈ ప్రాంతంలో ఏదైనా లోడు వాహనాలు వెళ్తే రోడ్డు మొత్తం విరిగిపోయే ప్రమాదం ఉంది. సీసీరోడ్డు విరిగిపోక ముందే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దాని రక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మండలాన్ని తూర్పులో విలీనం చేయాలి



మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్న అఖిలపక్ష నేతలు

ఆలమూరు: మండలాన్ని అన్ని విధాలుగా అనుకూలంగా ఉన్న రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. మండలంలోని జొన్నాడలో ఉన్న రైతు భవనంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం జరిగింది. కార్యక్రమానికి మండలంలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, పెన్షనర్లు, విద్యార్థి సంఘ నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆలమూరు మండలంలోని ప్రజల సౌకర్యార్థం తూర్పులో విలీనం చేయాలని, నియోజకవర్గ ప్రస్తావన ఏమీ కార్యాచరణలో లేదని వారు తెలిపారు. మండలం ప్రస్తుతం జిల్లా పరిధిలో ఉండటం వల్ల మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జేఏసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అమలాపురం మండలానికి సుమారు 56 కిలోమీటర్ల దూరంలో ఉందని అదే క్రమంలో రాజమహేంద్రవరం కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉందన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. తదుపరి నిర్వహించే సమావేశంలో మండల అఖిలపక్ష కమిటీ ఎన్నిక జరిపి పూర్తి కార్యాచరణ ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

గురజాడ రచనలు స్ఫూర్తిదాయకం

రాజోలు: కవిశేఖరుడు గురుజాడ అప్పారావు రచనలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అన్నారు. ఆదివారం రాజోలు ప్రభుత్వ కళాశాల ఆవరణలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఆధునిక యుగంలో ఎన్నో సాంఘిక దురాచారాలపై గురజాడ పోరాటలు చేశారన్నారు. తెలుగు శాఖాధిపతి పి.శైలజ, డాక్టర్ చంద్రబోస్, పి.లావణ్య, నల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



బొలిశెట్టి రోహిత్‌కుమార్

రాజోలు: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు శివకోటి ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-19 విభాగంలో బొలిశెట్టి రోహిత్‌కుమార్ అర్హత సాధించాడు. ఆదివారం ఈ మేరకు విద్యార్థి రోహిత్‌కుమార్‌ను ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ అభినందించారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోటీలు కాకినాడలో జరిగాయి. జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపిన రోహిత్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

మామిడికుదురు: ఉద్యోగులు అందించే సేవలతోనే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కొమరాడ గ్రామస్థులు పేర్కొన్నారు. సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను స్థానికులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఐదేళ్లలో వారు ప్రజలకు చక్కటి సేవలందించారని పేర్కొన్నారు. ఉద్యోగం చేసే ప్రతి చోట ప్రజలకు ఉత్తమ సేవలందించి వారి మన్ననలు పొందాలని అభిలాషించారు.

బాలుడి వైద్యానికి సాయం

రావులపాలెం: ప్రమాదవసాత్తు గాయపడిన రెండేళ్ల చిన్నారి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.26 వేలు సాయాన్ని ఆదివారం అందజేశారు. రాజమహేంద్రవరం మంగళవారపుపేటకి చెందిన బొట్ట నిఖిల్ శ్రీవత్స పొయ్యి మీద ఉడుకుతున్న రాగి జావను మీదకి లాగేసుకోవడంతో శరీరం తీవ్రంగా కాలిపోయింది. వైద్యానికి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో బాబు తండ్రికి ఆర్థిక స్తోమత లేక సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో నిఖిల్ శ్రీవత్స తండ్రి రవి ప్రకాష్‌కి సంస్థ సభ్యులు చెక్కును అందజేశారు.

ఘనంగా చండీహోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో ఉన్న శ్రీనూకాంబిక అమ్మ వారి ఆలయంలో ఆదివారం వైభవంగా చండీ హోమం జరిగింది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీనూకాంబిక అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఏఎన్ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

రాజోలు: పడమటిపాలెంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం కందికట్ల రత్నకుమారిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని రాజోలు తాలూకా యూనిట్ ఎన్జీఓ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం రాజోలులో సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఏఎన్ఎంపై దాడికి పాల్పడిన రేఖపల్లి దొరబాబు, అడబాల వెంకట నాగ సత్యవతిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంపై దాడి చేయడమే కాకుండా ఆమెపై తప్పుడు ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆరోగ్య శాఖలో 14 ఏళ్లుగా ఏఎన్ఎంగా సేవలు అందిస్తున్న రత్నకుమారికి జిల్లా ఆరోగ్యశాఖ అండగా నిలవాలని కోరారు. సంఘ కార్యదర్శి ఐ.ప్రతాప్‌రాజు, డాక్టర్ సాయిబాబా, డాక్టర్ ప్రియాంక, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.